ప్రజాభూమి
సత్యసాయి, అనంతపురం

# మహర్షి వాల్మీకి బోయ సంఘం జిల్లా యువజన ఉపాధ్యక్షులుగా నరేంద్ర.



ప్రజా భూమి, లేపాక్షి

జిల్లా మహర్షి వాల్మీకి బోయ సంఘం జిల్లా ఉపాధ్యక్షులుగా లేపాక్షి మండల పరిధిలోని కంచి సముద్రం గ్రామానికి చెందిన నరేంద్రను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మహర్షి వాల్మీకి బోయ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్, ఉపాధ్యక్షులు మహేష్ కుమార్, కార్యదర్శి జక్కల శ్రీనివాసరావు నియామకపు ఉత్తర్వులను నరేంద్ర కు పంపించారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ, నాకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానన్నారు. యువతను కలుపుకొని వాల్మీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

# "అనంత"లో ఎక్సైజ్ శాఖ మంత్రికి ఘన స్వాగతం



ప్రజాభూమి, అనంతపురము

రాష్ట్ర ఎక్సైజ్, గనులు, జియాలజీ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అనంతపురం జిల్లా పర్యటనకు విచ్చేశారు. ఈ సందర్భంగా నగరంలోని ఆర్.అండ్.బి. అతిథి గృహంలో మంత్రిని గురువారం ఉదయం అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎంపీతో పాటు అనంతపురము అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్, మడకశిర ఎమ్మెల్యే, టిటిడి సభ్యులు ఎంఎస్.రాజు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలు అందజేసి ఘన స్వాగతం పలికారు. తదనంతరం జిల్లా విషయాలపై వారు చర్చించుకున్నారు.

# ఆసుపత్రిని పరిశీలించిన కాయకల్ప బృందం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిని కాయకల్ప బృందం గురువారం పరిశీలించింది. విజయ వాడ నుంచి వచ్చిన కాయకల్ప బృందం వైద్యులు రామారావు, నరేష్, క్వాలిటీ కంట్రోలర్ సుబ్రహ్మణ్యంలు పరిశీలించారు. జాతీయ ఆరోగ్య మిషన్ యేటా అందించే కాయకల్ప అవార్డును ఇంటర్నల్ అసెస్మెంట్ లో భాగంగా బృందం సభ్యులు ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాలను సందర్శించి స్వచ్ఛత, సదుపాయాలు, బయోమెడికల్ వేస్టేజ్, ల్యాబ్, మందుల నిర్వహణ, పరిశుభ్రత, వికలాంగుల సౌకర్యాలు సిబ్బంది పనితీరు బెడ్స్ నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ లింగన్న మాట్లాడుతూ, ఆసపత్రిని కాయకల్ప బృందం సందర్శించిందని, త్వరలో మరో బృందం వస్తుందన్నారు. హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి గత కొన్ని సంవత్సరాలుగా కాయకల్ప గుర్తింపు వస్తుందని, ఈ సంవత్సరం సైతం గుర్తింపు లభిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ పరిశీలనలో వీరితో పాటు వైద్యులు వైద్య ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# పెద్దిరెడ్డి, మిథున్ రెడ్డి లను కలిసిన వైకాపా నాయకులు





ప్రజాభూమి, హిందూపురం టౌన్

వైయస్సార్సీపి రాయలసీమ కోఆర్డినేటర్, పుంగనూరు శాసనసభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యులు మిథున్ రెడ్డి లను గురువారం తిరుపతిలో హిందూపురం వైకాపా నాయకులు కొండూరు వేణుగోపాల్ రెడ్డి, కొటిపి హనుమంతరెడ్డి, శెట్టిపల్లి జగన్మోహన్ రెడ్డిలు కలిశారు. ఈ సందర్భంగా ఆయా నేతలకు నాయకులు బొకేలు అందజేశారు. ఇందులో భాగంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలు హిందూపురం నియోజకవర్గం లో పార్టీ పరిస్థితి, కార్యకర్తలను ఆదుకొంటున్న అంశం తదితర విషయాలపై చర్చించారు. పార్టీలో కష్టపడి పని చేసే నాయకులకు తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందని, కార్యకర్తలకు అండగా ఉంటూ విభేదాలకు అవకాశం లేకుండా ఐక్యతతో వెలిగి పార్టీ బలోపేతానికి కృషి చేయాలని నేతలు స్థానిక నాయకులకు సూచించినట్లు సమాచారం.

# విద్యుత్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభం



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం పట్టణంలోని శ్రీ వాసవి ధర్మశాల రోడ్డులో ఉన్న విద్యుత్ శాఖ కార్యాలయంలో గురువారం సద్గురు యోగి నారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేయగా డివిజనల్ ఇంజనీర్ భూపతి ప్రారంభించారు. కార్యాలయానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు ప్రస్తుత వేసవిలో తాగునీటి కోసం ఇబ్బందులు పడకూడదని ఉద్దేశంతో సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సేవా సమితి అధ్యక్షులు రవిశంకర్ తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం పట్ల విద్యుత్ శాఖ అధికారులు సేవాసమితి ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడిఈలు సి. నాగన్న, జ్యోత్స్న, బిఎల్ శ్రీనివాసులు, యూనియన్ నాయకులు, భగీరథ నవీన్ కుమార్, అయ్యప్ప చాట్ శబరి, నాగరాజు, విద్యుత్ కార్యాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



ప్రజాభూమి, హిందూపురం టౌన్

హిందూపురం రూరల్ మండల పరిధిలోని సంతేబిదనూరు సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన అశ్వర్థ నారాయణ అనే వ్యక్తి మృతి చెందారు. అశ్వర్థ నారాయణ గురువారం ఉదయం వాకింగ్ నిమిత్తం గ్రామ సమీపంలో వెళు ండగా వెనుకవైపు నుండి గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో మృతి చెందారు. ఢీ కొట్టిన వాహనం వేగంగా వెళ్ళిపోయింది. విషయం తెలిసిన వెంటనే రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హిందూపురం ప్రభుత్వాసుపత్రిక తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# ఎమ్మెల్యే దగ్గుపాటి నివాసానికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

## గజమాలతో ఘన స్వాగతం.. తరలివచ్చిన ఎమ్మెల్యేలు

ప్రజాభూమి, అనంతపురము

స్థానిక అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఇంటికి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంట గురువారం సందడి వాతావరణం నెలకొంది. జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురం వచ్చిన మంత్రి, ఎమ్మెల్యే దగ్గుపాటి ఆహ్వానం మేరకు వారి ఇంటికి వెళ్లారు. సందర్భంగా ఎమ్మెల్యే దగ్గుపాటితో పాటు స్థానిక టీడీపీ నాయకులు గజమాలతో మంత్రి ఘన స్వాగతం పలికారు. అలాగే రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, మడకశిర ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ తో పాటు ముఖ్య టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దగ్గుపాటి ఇంటికి వచ్చారు. దీంతో అక్కడ సందడి వాతావరణం కనిపించింది. మంత్రితో



పాటు ఎమ్మెల్యేలంతా అల్పాహార విందులో పాల్గొన్నారు. అనంతరం వారు మంత్రితో జిల్లా రాజకీయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించు కున్నారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు కోనంకి గంగారామ్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ గౌస్ మొద్దిన్ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ హయాంలో అక్రమ కేసులు, దాడులు చేశారు

**సత్యసాయి జిల్లాలో కుటుంబ కలహాలతో జరిగిన హత్యను రాజకీయం చేస్తున్నారు**

**ఎక్సైజ్, గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర**

ప్రజాభూమి, అనంతపురము

గత ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో ప్రతి ఒక్క ప్రజా ప్రతినిధిపై అక్రమ కేసులు పెట్టడం, దాడులు చేయడం జరిగిందని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. అనంతపురంలో రూ.11.10 కోట్లతో నిర్మించిన నూతన ఐ ఎం ఎఫ్ ఎల్ డిపో గోడౌన్ ను గురువారం మంత్రి, అనంతపురం జిల్లాలోని పలువురు ఎమ్మెల్యేలతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న రాప్తాడు నియోజకవర్గానికి వచ్చి కుటుంబ కలహాలతో జరిగిన హత్యను రాజకీయం చేయడానికి.. డబ్బులు ఇచ్చి జనాలను పోగుచేసి.. పోలీసులపై అనుచిత వ్యాఖ్యలను చేస్తున్నారని ఆరోపిస్తూ, దీనిని ప్రజలందరూ గమనించాలని మంత్రి సూచించారు. గతంలో కూడా ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఇంటిపై, తెలుగుదేశం కార్యా లయంపై దాడి చేసిన వారికి ప్రమోషన్స్ ఇస్తూ మంత్రి పదవులను ఇవ్వడం జరిగిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక తమ ప్రభుత్వం సంక్షేమ పథకాలకు పెద్దపీట వేస్తున్నదని, ఏ రాష్ట్రంలో లేని విధంగా రూ.4000 పింఛన్ ఇస్తున్నదని, సంవత్సరానికి రూ.33వేల కోట్లతో, ప్రతి నెలా 64 లక్షల పింఛన్లు ఇస్తున్నామన్నారు. దీపం పథకం ద్వారా గ్యాస్ సిలిండర్లను అర్హత కలిగిన ప్రతి ఇంటికి అందజేస్తున్నా మన్నారు. పేదరికం లేని సమాజాన్ని నిర్మించడం కోసం పీ-4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రవేశ పెట్టారన్నారు. నవోదయం కార్యక్రమం ద్వారా నాటుసారా, అక్రమమద్యం



రవాణా లేకుండా అన్ని చర్యలను చేపట్టడం జరుగుతున్నదని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో గంజాయిని నిరోధించేందుకు ఈగల్ వ్యవస్థని ఏర్పాటు చేశామన్నారు. అనంతరం రాష్ట్ర సాధారణ పరిపాలన, పొలిటికల్ అండ్ రెవెన్యూ (ఎక్సైజ్) శాఖల ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రెటరీ ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త మద్యం పాలసీ ద్వారా రెవెన్యూ పెరిగిందన్నారు. అధికారులందరూ నిజాయితీగా, పారదర్శకంగా పని చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదాయాన్ని పెంచాల న్నారు. అనంతరం అధునాతన గోడౌన్ గా నిర్మించడం జరిగిందన్నారు. ప్రస్తుతం కొంత భూ సమస్య ఉందని, ఆ సమస్యను జిల్లా కలెక్టర్ తొందరగా పరిష్కరించాలని, ఇందుకు స్థానిక ప్రజా ప్రతినిధులు కూడా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఆ భూమి కూడా అందుబాటులోకి వస్తే మరిన్ని కార్యాలయాలు ఏర్పాటు చేసి సజావుగా కార్యకలాపాలు నిర్వహించేందుకు వీలుంటుంది అన్నారు. ఏ.పీ.ఎస్.బి. సి. లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, డిస్టలరీస్, బ్రేవరీస్ కమిషనర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ, సుమారు 27 వేల చదరపు అడుగులలో అత్యంత సాంకేతికతతో కూడిన ఆత్యాధునిక గోడౌన్ ను నిర్మించడం జరిగిందన్నారు. హమాలీలు పనిచేసేందుకు ఈ గోడౌన్ సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత మాట్లాడుతూ 2016లో ఈ గోడౌన్ కాలిపోయిందని అప్పట్లోనే మంత్రిగా ఉన్న కొల్లు రవీంద్రను నూతన గోడౌన్ నిర్మించాలని కోరడం జరిగిందని, అందుకు 11 కోట్ల రూపాయలు కూడా అప్పట్లో మంజూరు చేయడం జరిగిందన్నారు. మరలా వారి చేతుల మీదుగానే ఈ గోడౌను ప్రారంభించుకోవడం ఆనందంగా ఉందన్నారు. హమాలీల సమస్యలను పరిష్కరించేందుకు మంత్రి, అధికారులు చొరవ తీసుకోవాలన్నారు. మడకశిర, సింగనమల ఎమ్మెల్యేలు ఎమ్మెస్ రాజు, బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ, హమాలీల సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లా డుతూ, పరిటాల సునీతమ్మ కృషితో మరల ఈ నూతన గోడౌన్ ప్రారంభించుకోవడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలోఎక్సైజ్ శాఖనమంత్రి, ఆ శాఖ ఉన్నతాధి కారులకు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత జ్ఞాపికలను బహుకరించారు. ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం గోడౌన్ హమాలీలకు ఎక్సైజ్ మంత్రి యూనిఫామ్ లను పంపిణీ చేసారు . అలాగే, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి నూతన గోడౌన్ ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ అనసూయ దేవి, ఏపీ.ఎస్.బి.సి. లిమిటెడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రవణ్ కుమార్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య, అసిస్టెంట్ కమిషనర్ మునుస్వామి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ డి.రామ్మోహన్ రెడ్డి, అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, ఎక్సైజ్ అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ శిక్షణా తరగతులు జయప్రదం చేయండి-కరపత్రాలను విడుదల చేసిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

ప్రజాభూమి, హిందూపురం టౌన్

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ నుండి మూడు రోజుల పాటు కడపలో జరిగే విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి కోరారు. గురువారం ఇందుకు సంబంధించిన కరపత్రాలను ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విడుదల చేశారు. ఈ సందర్భం జిల్లా ఉపాధ్యక్షులు నరసింహమూర్తి మాట్లాడుతూ, దేశంలో విద్యారంగం సంక్షోభంలో ఉన్నదని, శాస్త్రీయత లోపించి అశాస్త్రీయ భావాలతో విద్యార్థుల మెదడులో విచ్ఛిన్నమయ్యే విధంగా విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ పాలకులు కాషాయీ కరణను ప్రేరేపిస్తున్నారన్నారు. అందులో భాగంగానే యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడే అటానమస్ బాడీ అయిన యూజీసీ నూతన ముసాయిదాను తీసుకొని రావడం, రాజ్యాంగ విరుద్ధంగా వీసీ నియామకాలు చేపట్టే కార్యక్రమం చేయడం, విద్యార్థి హక్కులు కాల రాయడమే అన్నారు. మొత్తం విద్యా వ్యవస్థను కేంద్రీకృతం చేసి కాషాయీకరణ



విష బీజాలు విద్యార్థుల మెదడులను ప్రేరేపిస్తున్న పాఠ్యాంశాలుగా బోధిస్తున్న పరిస్థితులను చూడాల్సి వస్తోందన్నారు. వెంటనే విద్యార్థి హక్కులు కాపాడాలి, శాస్త్రీయ విజ్ఞానం అందించాలి, రాష్ట్రంలో ఇబ్బడి ముబ్బడిగా ప్రైవేటు యూనివర్సిటీల అనుమతి, న్యాక్ గ్రేడ్లు, రాజకీయ అన్యాయ కళాశాలలకు అటానమస్తుల ద్వారా ధారా దత్తం చేయడం వల్ల విద్యలో నాణ్యత తగ్గి యూని వర్సిటీలు రాజ్యమేలుతున్నాయని పేర్కొన్నారు. కార్పొరేట్ సెక్టార్కు రెడ్ కార్పెట్ వేస్తున్నట్లు రాష్ట్రంలో ఉన్నటువంటి వైద్య కళాశాలలను ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యం చేయడం 107, 108 జీవోలను రద్దు చేయకపోవడం వైద్య విద్యను అభాసుపాలు చేయడమేనని, సామాన్య మధ్యతరగతి ఆరోగ్య జీవన స్థితిగతులను కూడా ప్రభుత్వాలు వ్యాపారం చేసే స్థాయికి దిగజారాయన్నారు. అదే కాకుండా విద్యార్థుల ఆత్మహత్యలు ఫీజుల పేరుతో ర్యాంకుల పేరుతో కస్తూర్బా గాంధీ, అంబేద్కర్, జ్యోతిరావు పూలే లాంటి పాఠశాలల్లో విద్యార్థుల ఆత్మహత్యలు పెరిగిపోతున్నాయన్నారు. ఇలాంటి అనేక అంశాల పట్ల ఒక శాస్త్రీయమైన ఆలోచనతో అఖిల భారత విద్యార్థి ఫెడరేషన్ మూడు రోజులపాటు జరిగే శిక్షణ తరగతుల్లో వివిధ రంగాల్లో ఉన్నటువంటి ప్రొఫెసర్లు, మేధావుల తో రాజకీయ అభ్యున్నత విద్యారంగా సామాజిక వైద్య రంగ అంశాలకు సంబంధించి శిక్షణ పొంది శాస్త్రీ యమైన ఆలోచనతో విద్యారంగ సమస్యల పైన భవిష్యత్తు కార్యాచరణతో పోరాటాలకు సన్నద్ధం కావాలని పిలుపు నిచ్చారు, ఈ క్లాసులకు రాష్ట్ర నలు మూలల నుండి విద్యార్థి నాయకులు పాల్గొంటారని, అధిక సంఖ్యలో విద్యార్థులు తరలివచ్చి విజయవంతం చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఉపాధ్యక్షులు వెంకటేష్. బాబాజాన్, అనూష, పల్లవి, సరిత, సుష్మా, కల్పన, యశోద, శిరీష పాల్గొన్నారు.

# అనధికారికంగా నిర్మించిన షెడ్లను వెంటనే తొలగించాలి

## - మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్

ప్రజాభూమి, హిందూపురం టౌన్

పురపాలక శాఖకు సంబంధించిన పరిగి బస్టాండ్ ఆవరణలో అనధికారికంగా నిర్మాణం చేసిన షెడ్ లను వెంటనే తొలగించుకోవాలని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ కూరగాయల టోకు వ్యాపారులను ఆదేశించారు. గురువారం బాలయ్య పిఏ వీరయ్య తో కలిసి మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ప్రైవేట్ బస్టాండ్ ఆవరణంలో ఏర్పాటు చేసిన టోకు వ్యాపారుల షెడ్లను పరిశీలించారు. అదే విధంగా మార్కెట్ ను సందర్శించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో కూరగాయల టోకు వ్యాపారులు షెడ్లను నిర్మాణం చేసుకోవడంతో బస్టాండ్ ఆవరణం కుదించుకుపోయిందని తెలిపారు. వెంటనే వాటిని తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు అక్కడే ఆదేశించారు. ప్రతిరోజూ వేలాదిమంది వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వస్తుంటారని, అలాంటి జన సముదాయం ఎక్కువ ఉన్న ప్రాంతంలో ప్రజలకు అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయడంతో పాటు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాఘవేంద్ర, ఎంహెచ్ఓ శోభన్ రెడ్డి, టిడిపి నాయకులు వెంకటేష్, శీనా, ఎందుకే ఫ్యాన్స్ కన్వీనర్ నంబూరి సతీష్, జనసేన నాయకులు నిమ్మకాయల రాము తదితరులు పాల్గొన్నారు.

### షెడ్లు సరే... పూల వ్యాపారుల సంగతేంటి...!!

హిందూపురం పురపాలక సంఘంలో గత మూడు సంవత్సరాలుగా నూతనంగా నిర్మాణం చేసిన వాణిజ్య సముదాయ భవనాలు, కూరగాయల మార్కెట్, బస్టాండ్ ఆవరణలోని ఖాళీ స్థలం, వాణిజ్య సముదాయ భవనాలు, మార్కెట్ భవనాల కింద ఉన్న స్థలం అటు మున్సిపల్ పాలకవర్గానికి, అధికారులకు కనక వర్షం కురిపిస్తోంది. ప్రస్తుతం బస్టాండ్ ఆవరణంలో టోకు వ్యాపారులు నిర్మాణం చేసుకున్న షెడ్ లలో సైతం గత చైర్మన్ ఉన్న సమయంలో



పాలకులు, అధికారులు కలిసి భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. గురువారం బాలయ్య పిఏ వీరయ్యతో కలిసి మునిసిపల్ చైర్మన్ రమేష్ కుమార్ బస్టాండ్ ఆవరణంలో అనాధి కారికంగా నిర్మాణం చేసుకున్న షెడ్లను తొలగించాలని అధికారులకు ఆదేశించారు. అయితే దాదాపు రెండు సంవత్సరాలుగా ఒక్క పైసా కూడా పురపాలక సంఘానికి చెల్లించకుండా పూల వ్యాపారులు నూతన మార్కెట్ భవనం కింద పార్కింగ్ స్థలంలో పూల వ్యాపారాలు చేస్తున్నారు. పూల వ్యాపారుల నుంచి భారీగా ప్రస్తుత పాలకవర్గం ముడుపులు తీసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అందువల్లే వారిపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాలకవర్గం నిజంగా చిత్తశుద్ధితో ఉంటే వెంటనే అనధికారికంగా పురపాలక స్థలంలో వ్యాపారం చేసుకుంటున్న పూల వ్యాపారులపై చర్యలు తీసుకుని, మున్సిపల్ నిబంధనల మేరకు దాదాపు రెండు సంవత్సరాలకు సంబంధించిన ఆక్రమణ పన్ను తో పాటు అద్దెలను వసూలు చేస్తే పురపాలక సంఘానికి లక్షలాది రూపాయల ఆదాయం లభించే అవకాశాలు ఉన్నాయి. అయితే పాలకులు అధికారులు కలిసి పురపాలక సంఘానికి రావాల్సిన ఆదాయాన్ని గండికొట్టి తమ జేబులను నింపుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. వెంటనే ఈ విషయంలో బాలయ్య పిఏ వీరయ్య ప్రత్యేక శ్రద్ధ తీసుకొని పూల వ్యాపారులపై చర్యలు తీసుకొని పురపాలక సంఘ ఆదాయాన్ని పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని పుర ప్రజలు కోరుతున్నారు.

# తిలక్ నగర్ లో విద్యుత్ శాఖ లైన్మెన్ పై దాడి.

ప్రజా భూమి, లేపాక్షి

మండల పరిధిలోని తిలక్ నగర్ లో విద్యుత్ లైన్ మాన్ శివారెడ్డి పై అసిఫ్, అతని తల్లి షాహినా లు దాడి చేసినట్లు లేపాక్షి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే ఆసిఫ్ ఇంటి కరెంటు బిల్లును కట్టమని లైన్మెన్ శివారెడ్డి పలుమార్లు గుర్తు చేశారు. అయినా అతను కరెంట్ బిల్లు చెల్లించలేదు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రోజున ఆసిఫ్ ఇంటికి లైన్మెన్ శివారెడ్డి విద్యుత్ వైర్లను కట్ చేశారు. అయితే ఆసిఫ్ రాత్రి కట్ చేసిన వైర్లను మెయిన్ లైన్ కు వేసి కరెంటు వినియోగించుకున్నాడు. విషయం తెలిసిన శివారెడ్డి గురువారం ఉదయం ఆసిఫ్ తో ఇప్పటికైనా బిల్లు చెల్లించమని అడగ్గా ఆసిఫ్ అతని తల్లి శివారెడ్డి పై దాడి చేశారు. విషయాన్ని శివారెడ్డి ఉన్నతాధికాలకు తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. వెంటనే లైన్మెన్ శివారెడ్డి లేపాక్షి పోలీస్ స్టేషన్లో ఆసిఫ్ అతని తల్లిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

